క్లుప్తంగా

సరిపడా యూరియా అందించండి

హుస్నాబాద్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు సరిపడా యూరియా అందించాలని గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పడిగ ఎర్రయ్య, ప్రధాన కార్యదర్శి గన్నెబోయిన వెంకటాద్రి డిమాండ్ చేశారు. శనివారం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో సహకార సంఘాల వద్ద రైతులు యూరియా కోసం పడిగాపులు కాస్తున్నారని వాపోయారు. సకాలంలో యూరియా వేయకపోతే పంట దిగుబడి తగ్గి నష్టపోతారని, అవసరానికి తగ్గట్లుగా గోదాముల్లో యూరియా నిల్వ చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

క్రీడల్లో సత్తాచాటిన విద్యార్థులు


విద్యార్థులతో ఉపాధ్యాయులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడల్లో తిగుల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నాలుగు విభాగాల్లో ప్రథమస్థానం గెలుచుకుని సత్తా చాటారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులు, పీఈటీ రాజిరెడ్డిని ఎంఈఓ మాధవరెడ్డి, హెచ్‌ఎం అనసూయ శనివారం అభినందించారు. వాలీబాల్ అండర్ 17లో ఖోఖో, కబడ్డీ, అండర్ 14లో ప్రథమస్థానంలో సాధించినట్లు పీఈటీ రాజిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న కార్మికులు

చిన్నకోడూరు(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా పెంచడంతో భవన నిర్మాణరంగ కార్మికులు సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. చిన్నకోడూరులో శనివారం ఆ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం మాట్లాడుతూ భవన నిర్మాణరంగ కార్మికులకు ఇచ్చే ఎక్స్‌గ్రేషియా పెంపునకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం శుభపరిణామం అన్నారు. కార్మికులు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షలు, సాధారణ మరణానికి రూ.2 లక్షలకు పెంచుతున్నట్లు కార్మికశాఖ నిర్ణయం తీసుకుందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ, ఐలయ్య, మల్లేశం పాల్గొన్నారు.

రేపు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడి


మాట్లాడుతున్న కిశోర్

హుస్నాబాద్‌రూరల్/హుస్నాబాద్: జీఓ 99ని రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాలను ముట్టడించనున్నట్లు మాల మహానాడు నియోజకవర్గ అధ్యక్షుడు ఆరె కిశోర్ తెలిపారు. హుస్నాబాద్‌లో శనివారం నిర్వహించిన మాల మహానాడు సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో మాల, మాల ఉపకులాలకు అన్యాయం జరుగుతుందని, రిజర్వేషన్ అమలులో రోస్టర్ విధానం 22 నుంచి 16కు తగ్గించాలని డిమాండ్ చేశారు. వర్గీకరణ చేసే సమయంలో మాల ఎమ్మెల్యేలెవరూ ప్రశ్నించలేదని, అందుకే క్యాంపు కార్యాలయాలను ముట్టడిస్తున్నామని చెప్పారు. నియోజకవర్గ మాలలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో శ్రీనివాస్, మురళి, రాజమౌళి, యాదగిరి, సుమన్, శ్రీనివాస్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

16న అమరవీరుల సంస్మరణ సభ: మల్లారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మల్లారెడ్డి

చేర్యాల(సిద్దిపేట): దూళ్మిట్ట మండలం భైరాన్‌పల్లిలో 16న నిర్వహించనున్న తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరుల సంస్మరణ సభను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆనాటి సాయుధ పోరాటంలో అమరులైన వారిని స్మరించుకోడానికి అధిక సంఖ్యలో ప్రజలు తరలిరావాలని కోరారు. సమావేశంలో వెంకట్‌మావో, శశిధర్, సత్తిరెడ్డి, కృష్ణారెడ్డి, శారద, ప్రశాంత్, అరుణ్‌కుమార్, రవీందర్, నాగరాజు, షఫియోద్దీన్, శోభ, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.


కోమటి చెరువులో గణేశుడి నిమజ్జనం


మట్టిగణపతి ప్రతిమలతో మహిళల ఊరేగింపు


ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): గణనాథుడికి హారతులు


నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథులు


గజ్వేల్‌రూరల్: వాసవీనగర్‌లో..


సిద్దిపేటలో గణపతి ఊరేగింపు


శోభాయాత్రలో చిన్నారుల కేరింతలు


ఊరేగింపులో యువకుల ఉత్సాహం

బైబై గణేశా..

వినాయక నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని శనివారం నిమజ్జనాలు ఘనంగా కొనసాగాయి. చివరిరోజు కావడంతో జిల్లా వ్యాప్తంగా గణేశుడి విగ్రహాలు శనివారం గంగమ్మ ఒడికి చేరాయి. మండపాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, లడ్డూలు, కళశాలను వేలం వేశారు.


గజ్వేల్‌లో రూ.1.82 లక్షలకు లడ్డూ దక్కించుకున్న వినయలత సురేశ్ దంపతులు

పంచాయతీలో పైసల్లేవ్..!


రామవరం పంచాయతీ కార్యాలయం వద్ద నిరుపయోగంగా మోటారు

మూలకు చేరిన సింగిల్‌ఫేస్ మోటార్లు

- పట్టించుకోని ఉన్నతాధికారులు
- తాగునీటి కోసం స్థానికుల ఇక్కట్లు

అక్కన్నపేట(హుస్నాబాద్): మరమ్మతులు చేయించడానికి పైసల్లేక గ్రామాల్లో సింగిల్ ఫేస్ మోటార్లు మూలకు చేరాయి. మండలంలోని రామవరం గ్రామంలో మొత్తం 17 సింగిల్ ఫేస్ మోటార్లు ఉన్నాయి. అందులో ప్రస్తుతం ఆరు మోటార్లు కాలిపోయాయి. వాటిని బయటకు తీయించి జీపీలో ఓ మూలకు చేర్చారు. నల్లాల బావి, మిషన్ భగీరథ ద్వారా గ్రామస్తులకు తాగునీరు అందజేస్తున్నారు. మరో పక్క సింగిల్ ఫేస్ మోటార్లు కాలిపోయిన ప్రాంతాల్లో ప్రజలు తాగునీరు లేక అవస్థలు పడుతున్నారు.

డబ్బులేవు..

గ్రామంలో ఆరు మోటార్లు చెడిపోవడంతో వాటిని బటయకు తీసి ఉంచామని, మరమ్మతులు చేసేందుకు పంచాయతీలో డబ్బులు లేవని కార్యదర్శి తెలిపారు. మరమ్మతులు చేయించినా ఆ సింగిల్ ఫేస్ మోటార్లు పని చేయవని, వాటి స్థానంలో కొత్త మోటార్లు కొనుగోలు చేయాలని చెప్పారు.

> **రూ.2.52 లక్షలు అప్పుచేసి ఖర్చు చేశా..**
>
> నేను ఈ గ్రామానికి 13 నెలలు కిందట బదిలీపై వచ్చాను. అప్పటి నుంచి ఇప్పటి వరకు వివిధ పనులు కోసం రూ.2.52 లక్షలు అప్పులు చేసి ఖర్చు చేశాను. ఒటో తేదీన జీతం వస్తే మూడు రోజుల్లో నా అకౌంట్ ఖాళీ అయిపోతుంది. బ్లీచింగ్ పౌడర్ మొదలుకొని ప్రతి పనికీ డబ్బులు ఖర్చు చేయాల్సి వస్తుంది. పంచాయతీలో డబ్బులు లేక అప్పులు చేయవలసిన దౌర్భాగ్యమైన దుస్థితి నెలకొంది. జిల్లాలోని అన్ని పంచాయతీల కార్యదర్శుల పరిస్థితి ఇలానే ఉంది. ప్రభుత్వం మా సమస్యలు పరిష్కరించాలి.
>
> – బోలుమల్ల రాము, పంచాయతీ కార్యదర్శి

క్రీడల్లో టీజీడబ్ల్యుఆర్ఎస్ విద్యార్థినుల ప్రతిభ


ఖోఖో, వాలీబాల్ క్రీడల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థినులు

కొండపాక(గజ్వేల్): మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడల్లో టీజీడబ్ల్యుఆర్ఎస్ విద్యార్థినులు సత్తాచాటారు. అండర్ 17 బాలికల విభాగం ఖోఖో, వాలీబాల్ క్రీడల్లో ప్రథమ బహుమతిని గెలుచుకోగా అండర్ 14 బాలికల విభాగం కబడ్డీ పోటీల్లో ద్వితీయ బహుమతులు అందుకున్నారని ప్రిన్సిపాల్ సవిత తెలిపారు. విజేతలకు ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. నేటి ఓటమి రేపటి విజయానికి బాటలు వేస్తాయని చెప్పారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ శోభారాణి, పీఈటీ లక్ష్మి, ఉపాధ్యాయులు విద్యార్థినులను అభినందించారు.

విద్యార్థినికి స్కాలర్ షిప్ చెక్

కోహెడ(హుస్నాబాద్): ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి తాజీమీన్‌కు హైదరాబాద్‌కు చెందిన నిర్మాణ్ ఆర్గనైజేషన్ రూ.15 వేలు స్కాలర్‌షిప్ చెక్ అందజేసింది. ఈ సందర్భంగా తాజీమీన్ మాట్లాడుతూ ఎస్సెస్సీలో 532 మార్కులతో ప్రతిభ కనబర్చిన నేపథ్యంలో ఆన్‌లైన్ ద్వారా స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. దీంతో నిర్మాణ్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు తనను స్కాలర్‌షిప్‌కు ఎంపిక చేశారని, హైదరాబాద్‌లో శనివారం చెక్ అందజేసినట్టు తెలిపారు.


చెక్ అందజేస్తున్న నిర్మాణ్ ప్రతినిధులు

సంక్షిప్త వార్తలు

◆ జీఎస్టీ తగ్గించడం సంతోషకరం

సిద్దిపేటజోన్: తునికాకుపై ఉన్న 18 శాతం జీఎస్టీని కేంద్ర ప్రభుత్వం 5 శాతంగా ప్రకటించడంపై బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కలాల్ శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. స్థానిక బీఎంఎస్ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, నాయకులు కొండల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ కబ్జాచేస్తే చర్యలు తప్పవు

గజ్వేల్‌రూరల్: ప్రభుత్వ స్థలాలను కబ్జాచేస్తే చర్యలు తప్పవని గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ హెచ్చరించారు. పట్టణంలోని తూప్రాన్ రోడ్డు మార్గంలోగల నల్లాల బావి వద్ద ఉన్న స్థలంలో వేసిన గుడిసెను శనివారం మున్సిపల్ సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

◆ జీఎస్టీ తగ్గింపు హర్షణీయం

దుబ్బాక: కేంద్ర ప్రభుత్వం తీసుకున్న జీఎస్టీ తగ్గింపు నిర్ణయంతో పేద, మధ్య తరగతి వర్గాల్లో ఆనందం నెలకొందని బీజేపీ రాష్ట్ర నాయకుడు అంబటి బాలేష్‌గౌడ్ అన్నారు. దుబ్బాకలో మున్సిపల్ అధ్యక్షుడు శ్రీకాంత్‌యాదవ్ ఆధ్వర్యంలో శనివారం ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. తిరుమల్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, భాస్కర్, ప్రవీణ్, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ పత్తిలో సస్యరక్షణ అవసరం

తొగుట(దుబ్బాక): పత్తి పంట పూత, కాత దశలో అధిక వర్షాకు పంట ఒత్తిడికి గురై పూత, పిందెలు రాలిపోయి పంట ఎదుగుదల తగ్గుపోతుందని, ఈ నేపథ్యంలో పత్తి సాగుచేస్తున్న రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ విస్తరణ అధికారి నాగార్జున సూచించారు. మండల పరిధిలోని ఎల్లారెడ్డిపేటలో శనివారం పత్తి పంటను పరిశీలించారు.

◆ నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చేర్యాల(సిద్దిపేట): ముస్త్యాల సబ్ స్టేషన్‌లో చేపడుతున్న మరమ్మతుల కారణంగా పట్టణ కేంద్రంతో పాటు మండలంలోని గుర్జకుంట, వేచరేణి, ముస్త్యాల గ్రామాల్లో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 12 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ వెంకట్‌గౌడ్ తెలిపారు.

కొమురవెల్లిలో..

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని గురువన్నపేట, కొమురవెల్లి సబ్‌స్టేషన్‌ల పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనున్నట్లు ఏఈ మధు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముస్త్యాల సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మండలంలోని కొమురవెల్లి, గౌరయపల్లి, కిష్టంపేట, రాంసాగర్, అయినాపూర్, గురువన్నపేట, తపాస్‌పల్లి, పోసాన్‌పల్లి గ్రామాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పూర్తిగా విద్యుత్‌ను నిలివేస్తామని, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సింగిల్‌ఫేజ్ విద్యుత్ సరఫరా చేస్తామని తెలిపారు.

◆ తుది ఓటరు జాబితా విడుదల

అక్కన్నపేట(హుస్నాబాద్): ప్రజాపరిషత్ కార్యాలయంలో శనివారం డీపీఓ దేవకీ దేవి ఆధ్వర్యంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీల తుది ఓటరు జాబితా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 12 ఎంపీటీసీ స్థానాలు ఉండగా 35,588 మంది ఓటర్లు ఉన్నారన్నారు. బీఎల్‌పీఓ వెంకటేశ్వర్లు, మిషన్ భగీరథ డీఈ రుహిన తస్కిన్, ఎంపీడీఓ భానోతు జయరాం, ఎంపీఓ గుగులోతు మోహన్‌నాయక్, ఉపాధి హామీ ఏపీఓ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

◆ ప్రతాప్‌రెడ్డికి పలువురు పరామర్శ

జగదేవ్‌పూర్(గజ్వేల్): బీఆర్ఎస్ నేత, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి తల్లి వజ్రమ్మ మృతి చెందిన విషయం తెలిసిందే. శనివారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు శేఖర్‌రెడ్డి, చిరుపర్తి లింగయ్య, కుసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి దౌలాపూర్‌లో ప్రతాప్‌రెడ్డి స్వగృహంలో వజ్రమ్మ చిత్ర పటానికి పూల మాలాలు వేసి నివాళులర్పించారు.

◆ నంగునూరుకు 11 ఎంపీటీసీ స్థానాలు

నంగునూరు(సిద్దిపేట): మండలంలోని 11 ఎంపీటీసీ స్థానాలకు పోలింగ్ స్టేషన్ల వారీగా ఓటరు జాబితాను ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం విడుదల చేశారు. ఎంపీడీఓ వేణుగోపాల్ మాట్లాడుతూ పంచాయతీ కార్యాలయాల్లో ఓటరు జాబితాలు ఏర్పాటు చేశామన్నారు.

గురువుల స్థానం చాలా గొప్పది


జగదేవ్‌పూర్(గజ్వేల్): ఉపాధ్యాయుడు వెంకట్రామిరెడ్డిని సన్మానిస్తున్న కలెక్టర్ హైమావతి, డీఈఓ


హుస్నాబాద్: మోడల్ స్కూల్లో ఉపాధ్యాయులకు ఘన సన్మానం

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని శనివారం గురువుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో విద్యార్థులు తమ ఉపాధ్యాయులకు పూల మాలలు, పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా సన్మానించారు. వక్తలు మాట్లాడుతూ సమాజంలో గురువుల స్థానం అత్యున్నతమైనదని, విద్యార్థుల భవిష్యత్ నిర్మాణంలో గురువుల పాత్ర అపారమని కొనియాడారు.


ములుగు(గజ్వేల్): ఎంఈఓ ఉదయ్‌భాస్కర్‌రెడ్డిని సన్మానిస్తున్న రోటరీ ప్రతినిధులు


దౌల్తాబాద్(దుబ్బాక): ఉపాధ్యాయులు నవీన్‌రెడ్డి, వేణుగోపాల్, హుస్సేన్, ఉమారాణికి సన్మానం


దుబ్బాకరూరల్: కలెక్టర్, డీఈఓ నుంచి అవార్డు అందుకుంటున్న శ్రీనివాస్


నంగునూరు(సిద్దిపేట): రామిరెడ్డిని సన్మానిస్తున్న డీఈఓ, ఎంఈఓ, ఉపాధ్యాయులు

లక్ష్యాన్ని ఛేదించాలంటే విద్యే అస్త్రం

న్యాయమూర్తి మిలింద్ కాంబ్లే

మిరుదొడ్డి(దుబ్బాక): అనుకున్న లక్ష్యాన్ని ఛేదించాలంటే విద్యనే అస్త్రంగా మల్చుకోవాలని న్యాయమూర్తి మిలింద్ కాంబ్లే పిలుపునిచ్చారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.సాయిరమాదేవి ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో శనివారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష్య సాధనలో ఎన్ని ప్రతికూల పరిస్థితులు ఎదురైనా కుంగిపోవద్దన్నారు. ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితేనే భవిష్యత్‌కు మంచి దారి దొరుకుతుందని, కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ఎవరైన అసభ్యంగా ప్రవర్తించినా, ఎటువంటి సమస్యలు ఎదురైనా తల్లిదండ్రులకు, టీచర్లకు తెలియజేయాలని కోరారు. అనంతరం విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కిషన్, ఏపీఓ తిరుపతి, జేఎంఎఫ్‌సీ అడ్వకేట్లు వి.శ్రీశైలం, ఎం.పూర్ణచందర్, సీఐ శ్రీనివాస్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, బాలకిషన్, రాజేశ్వరి పాల్గొన్నారు.


విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేస్తున్న న్యాయమూర్తి మిలింద్ కాంబ్లే

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

ఏసీపీ సదానందం

అక్కన్నపేట(హుస్నాబాద్): శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హుస్నాబాద్ ఏసీపీ సదానందం హెచ్చరించారు. మండల పరిధిలోని రామవరంలో శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడారు. శాంతియువత వాతావరణంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగేలా చూడాలని సూచించారు. పాతకక్షలను మనుస్సులో ఉంచుకొని గొడవలకు పాల్పడవద్దని, ఎన్నికలు పూర్తయ్యే వరకు శాంతియుతంగా ఉండాలని కోరారు. పెట్రోలింగ్, బ్లూకోల్ట్స్ వాహనాలతో అధికారులు, సిబ్బంది నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ చాతరాజు ప్రశాంత్, మాజీ సర్పంచ్ బూర్ర ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఏసీపీ సదానందం

అంతర పంటపై అవగాహన


క్షేత్రస్థాయి పరిశీలనలో పాల్గొన్న రైతులు

నంగునూరు(సిద్దిపేట): ఆయిల్‌పామ్‌లో అంతర పంట సాగుచేసే విధానాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు శనివారం నంగునూరు, మిరుదొడ్డి, దుబ్బాక మండలాల రైతులు ఖమ్మం జిల్లా అశ్వరావ్‌పేటకు తరలివెళ్లారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్‌పామ్‌లో అంతర పంట కోకో, వక్కసాగును పరిశీలించారు. అనంతరం చింతపల్లిలోని రైతు బాజీ నర్సరీ, ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయిల్‌ఫెడ్ అధికారి ఫణీంద్ర అంతర పంట సాగుపై అవగాహన కల్పించారు.

మల్లన్నను దర్శించుకున్న ఐఏఎస్

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామిని గిరిజన గురుకులాల సంక్షేమ శాఖ కార్యదర్శి కె.సీతాలక్ష్మి శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు తీర్థ ప్రసాదాన్ని అందించారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.


మల్లన్న సన్నిధిలో సీతాలక్ష్మి